# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్, సోమవారం 21 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL


ఎండిపోతున్న జొన్న పంటను చూపిస్తున్న రైతు



# రైతన్నకు కన్నీరు

## మత్తడి వాగు ద్వారా నీరందించని కాంగ్రెస్ ప్రభుత్వం

- వట్టిపోతున్న వేల ఎకరాల జొన్న, మక్క, వేరుశనగ పంటలు
- సాగు నీరందించి ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

తాంసి, ఏప్రిల్ 20 : మత్తడి వాగు ప్రాజెక్టు పరిధి కుడి, ఎడమ కాలువల పరిధిలో జొన్న, మక్క, కూరగాయలు, వేరుశనగ పంటలు సాగవుతున్నాయి. కుడి కాలువ ఆయకట్టు 1200 ఎకరాలు, ఎడమ కాలువ ఆయకట్టు 8,500 ఎకరాలు ఉంటుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కుడి కాలువను రూ.7.34 కోట్లతో తొమ్మిది కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేశారు. ఈ కాలువ ద్వారా తాంసి మండలంలోని హస్నాపూర్, వడ్డాడి, తలమడుగు మండలంలోని ఖడద్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామాల్లో దాదాపు 320 మంది రైతులు 1200 ఎకరాలు సాగు చేస్తున్నారు. దాదాపు 99 శాతం పనులు పూర్తయినప్పటికీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా నీరు అందించడం లేదు. ఎడమ కాలువ ద్వారా అరకొరగా నీరు అందుతున్నా.. చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఫలితంగా పంటలు వట్టి పోతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, కాలువల ద్వారా నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. మత్తడి ప్రాజెక్టు కుడి కాలువను వచ్చే ఏడాదైనా ప్రారంభించాలని, లేకపోతే ఉద్యమం తప్పదని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం పూర్తయినా కాలువ ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని రైతులు మండిపడుతున్నారు.



### మూడెకరాల్లో జొన్న ఎండింది..

అసలు బోరులో నీళ్లు లేవు. నీటి కొరత వల్లే మా పంట పూర్తిగా ఎండింది. నేను హస్నాపూర్ శివారులో ఐదెకరాల్లో వేసిన జొన్న పంటలో మూడెకరాలు పూర్తిగా ఎండింది. రూ.30 వేల పెట్టుబడి పెట్టినా ఏం లాభం లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ముందుకొచ్చి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. రైతులకు ఆర్థిక సాయాన్ని అందించి, భవిష్యత్‌లో నీటి వనరుల కోసం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పంట నష్టం నివారణకు తక్షణ సహాయం అందించాలి.

*- పాలకొండ గోవర్ధన్, రైతు, హస్నాపూర్.*



హస్నాపూర్ శివారులో నీరు లేక ఎండిపోతున్న వేరుశనగ పంట

### కాలువ ప్రారంభం కాక పంట నష్టం

నేను హస్నాపూర్ శివారులో నాలుగు ఎకరాల్లో జొన్న వేశా. మత్తడి ప్రాజెక్టు కుడి కాలువ ప్రారంభం కాకపోవడంతో సాగు నీరు అందడం లేదు. రెండు ఎకరాల్లో పంట పూర్తిగా ఎండింది. మత్తడి కుడి కాలువతో నీళ్లు వస్తాయన్న ఆశతో జొన్న విత్తనాలు వేశాం. కానీ.. కుడి కాలువ నీరు ఇవ్వలేదు. పెట్టుబడి ఖర్చులు కూడా తిరిగి రాలేదు. మిగిలిన పంట ఎండిపోకుండా చూసుకుంటున్నాం. కాలువ ప్రారంభమై ఉంటే పంట చేతికొచ్చేది.

*- దర్శనాల రవి కిరణ్, రైతు, హస్నాపూర్.*





అమరవీరుల జెండా వద్ద పూజలు చేస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు, ఆదివాసులు

### రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది..

**- సీతక్క, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పును ఒప్పుకుని ఇంద్రవెల్లి అమరులను గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాలు అందిస్తుందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా నిర్వహిస్తుందన్నారు. 1981, ఏప్రిల్ 20న మృతి చెందిన అమరుల కుటుంబాలకు ఇండ్లస్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం నాలుగు కుటుంబాలకు వాహనాలు అందించామన్నారు. కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను గుర్తించడానికి ఐటీడీఏ ద్వారా కమిటీ ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తామన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడానికి కమిటీని ఏర్పాటు చేసి పూర్తి వివరాలు సేకరించిన తరువాతనే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రూ.15 కోట్లతో ఉట్నూర్‌తోపాటు ఏటూరునాగారంలో కొత్తగా ఐటీడీఏ కార్యాలయాల నిర్మాణానికి ప్రణాళికలు చేశామన్నారు.

# ఇంద్రవెల్లి అమరులకు నివాళి

## సంప్రదాయబద్ధంగా శ్రద్ధాంజలి ఘటించిన ఆదివాసులు

- నివాళులర్పించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రముఖులు
- స్తూపం వద్ద పోలీసుల భారీ బందోబస్తు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 : హీరాపూర్ గ్రామ సమీపంలో గల అమరవీరుల స్తూపం వద్ద రగల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ గిరిజన పెద్దల ఆధ్వర్యంలో స్వేచ్ఛగా నివాళులర్పించారు. ఏప్రిల్ 20, 1981లో పోలీసుల కాల్పుల్లో అమరులైన ఆదివాసులకు గిరిజనులు తమ సంస్కృతి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అధికారికంగా నిర్వహించిన 44వ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు ఆదివారం ఉదయం10 గంటలకు అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. గోండ్‌గూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంది. ముందుగా అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నిర్వహించే సంప్రదాయ పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. అమరవీరుల స్తూపంతోపాటు జెండాల వద్ద సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యుల తోపాటు ఆదివాసులు నివాళులర్పించారు.

### తొడసం ఖట్టికి నివాళి

గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేసి మృతి చెందిన తోడసం ఖట్టికి తుమ్మగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని తుమ్మగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో సమక ఎక్స్‌రోడ్డు వద్ద ఖట్టి స్మారకార్థం ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. యేటా ఏప్రిల్ 20న సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామన్నారు.



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, ఆదివాసీ గిరిజనులు

### నివాళులర్పించిన ప్రముఖులు

ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ గోడం నగేశ్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, ప్రేమ్‌సాగర్ రావు, కోవ లక్ష్మి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్, డీఎఫ్‌వో బాజీరావ్ పాటిల్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగణక్క, బీఆర్‌ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, రాయిసెంటర్ల సార్‌మేడీలు మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, మెస్రం చిన్ను పటేల్, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు గోడం గణేశ్, కోడప నగేశ్, ఆత్రం భుజంగ్‌రావ్, కనక తుకారాం, ముకాడే విష్ణు, బోంత ఆశా రెడ్డి, తిరుపతి, కనక హనుమంత్‌రావ్, పెందర్ పుష్పారాణి, గరల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్, ప్రధాన కార్యదర్శి మెస్రం నాగ్‌నాథ్, తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు, గౌరవ అధ్యక్షుడు జుగ్నాక్ భారత్, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్, కనక తులసీరామ్, మానిక్‌రావ్, రాజ్‌వర్ధన్, దీలిప్ మోరే, రాజలింగు, కోడప నగేశ్‌లు అమరులకు నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

### స్తూపం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు

ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తోపాటు ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్ఐ సాయన్నల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండ ముందస్తు చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు దగ్గర ఉండి బందోబస్తును పర్యవేక్షించారు.



సమక ఎక్స్‌రోడ్డు వద్ద తొడసం ఖట్టి స్మారకార్థం ఏర్పాటు చేసిన జెండావద్ద నివాళులర్పిస్తున్న తుమ్మగూడ గ్రామస్తులు

# ప్రశాంతంగా బీసీ గురుకుల పరీక్ష

ఎదులాపురం, ఏప్రిల్ 20 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో 6,7,8 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 12 కేంద్రాల్లో నిర్వహించిన కేంద్రాలను ఉమ్మడి జిల్లా ఆర్సీవో శ్రీధర్ పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో 6వ తరగతిలో 1,150 మందికి 1,013 మంది, 7వ తరగతిలో 756 మందికి 663 మంది, 8వ తరగతిలో 783 మందికి 702 మంది 9వ తరగతిలో424 మందికి 379 మంది పరీక్ష రాశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,113 మందికి 2,757 మంది పరీక్ష రాయగా.. 356 మంది గైర్హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీసీవో ఎన్ కీర్తి తెలిపారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో శ్రీధర్

### పరీక్షా కేంద్రం తనిఖీ

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 20 : గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆదివారం నిర్మల్‌లో ప్రవేశ పరీక్షను నిర్వహించారు. పట్టణంలోని మహత్మ జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో నిర్వహించిన కేంద్రాన్ని ఆదివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో రామారావు, విద్యాశాఖ అధికారులు గీత, రమణారెడ్డి, లింబాద్రి, దశరథ్ ఉన్నారు.

# చలో వరంగల్ సభను జయప్రదం చేయండి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

నార్నూర్, ఏప్రిల్ 20 : ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి పర్యటనలో భాగంగా ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, నార్నూర్ సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, పార్టీ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, మాజీ సర్పంచ్‌లు రాథోడ్ మధూకర్, రాథోడ్ విష్ణు, మడావి ముక్తారూప్‌దేవ్, నాయకులు హైమద్, సుల్తాన్‌ఖాన్, యశ్వంత్‌రావు, సయ్యద్ ఖాశీం ఉన్నారు.



ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద 'చలో వరంగల్' బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

# పీఎం చేతుల మీదుగా అవార్డు అందుకొనున్న కలెక్టర్

ఎదులాపురం, ఏప్రిల్ 20 : సోమవారం సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా పీఎం నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డును కలెక్టర్ రాజర్షి షా అందుకొన్నారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌లో భాగంగా నార్నూర్ బ్లాక్ అస్పిరేషనల్ ప్రోగ్రాం 2024కు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రధాన మంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం 2024లో నార్నూర్ బ్లాక్ దేశంలో టాప్ ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పార్లమెంట్ సభ్యులు గొడెం నగేశ్, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా, ఆయా శాఖల జిల్లా అధికారుల సహకారంతో ఈ అవార్డు లభించిందని, ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# మెప్మాలో స్వాహా పర్వం

- రూ.2 కోట్లకు పైగా కుంభకోణంఆర్పీల చేతివాటం
- అడుగడుగునా పర్యవేక్షణ లోపం
- సోషల్ ఆడిట్‌లో గుట్టు రట్టు

నిర్మల్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా మెప్మా ఆధ్వర్యంలోని స్త్రీనిధి పథకంలో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకున్నది. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ.2 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు సోషల్ ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చింది. 2017 నుంచి 2022 వరకు ఐదేండ్లపాటు గుట్టు చప్పుడు కాకుండా అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. అప్పటి మెప్మా అధికారుల పర్యవేక్ష ణ చేయకపోవడం, ఆర్థిక లావాదేవీల ఆడిటింగ్ సక్రమంగా జరపకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. అయితే మెప్మా పరిధిలో స్త్రీనిధి కోసం విధులు నిర్వహించే ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లతో కొంత మంది సిబ్బంది ములాఖత్ అయి ఈ అక్రమ దందాను దర్జాగా కొనసాగించారు. తప్పుడు డ్యాక్యుమెంట్లు సృష్టించడం, బినామీల పేరిట రుణాలు తీసుకోవడం, ఆ తర్వాత తీసుకున్న రుణాలను చెల్లించకుండా సబ్సిడీ డబ్బులను స్వాహా చేయడం వంటి తతంగానికి పాల్పడ్డారు. మొదటి నుంచి ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించకపోవడం అక్రమాలకు ఆస్కారం ఇచ్చింది. చాలామంది పొదుపు సంఘాల సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై మంజూరయ్యే సబ్సిడీ డబ్బులను కొందరు ఆర్పీలు కాజేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల పరిధిలో 2,888 స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ఉన్నాయి. ఇందులో 28,880 మంది మహిళలు సభ్యులున్నారు. ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్ ద్వారా నిర్మల్ మున్సిపాలిటీ స్త్రీనిధి రుణాల్లో అక్రమాలు వెలుగు చూడడంతో భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో కూడా పకడ్బందీ తనిఖీలు చేపట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

### మొదలైన విజిలెన్స్ విచారణ

స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీ వ్యవహారంలో రూ.2 కో ట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. దీం తో రాష్ట్రస్థాయి మెప్మా విజిలెన్స్ విభాగం భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో కూడా విచారణ చేపట్టనున్నట్లు తెలిసిం ది. నిర్మల్ మున్సిపాలిటీలో 2017 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని రకాల రుణాలు, సబ్సిడీలు, ఇతర కార్యకలాపాల అంశాలపై కూడా రాష్ట్రస్థాయి బృందం లోతుగా దర్యాప్తు చే యనున్నది. మెప్మా ఉన్నతాధికారులతోపాటు ఆడిటింగ్, పో లీస్ విభాగాలు ఈ అక్రమాలపై ఇప్పటికే విచారణ ప్రారంభించాయి. ప్రాథమిక విచారణ ద్వారా రూ.2 కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయినప్పటికీ, పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయని చెబుతున్నారు.

### ఐదుగురు ఆర్పీలపై ఫిర్యాదు

నిర్మల్ మున్సిపాలిటీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఆర్పీలపై మెప్మా పీడీ, ఉన్నతాధికారులకే కాకుండా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ అక్రమాల గుట్టును రట్టు చేసేందుకు ఓ పోలీసు అధికారిని ప్రత్యేకంగా విచారణ కోసం రంగంలోకి దించారు. సంబంధిత పోలీసు అధికారి ఇటీవలే నిర్మల్ మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. తన విచారణ నివేదికను ఎస్పీకి అందించారు. దీంతో ఎస్పీ సంబంధిత మెప్మా అధికారులకు ఆ నివేదికను అందజేయడమే కాకుండా, అవినీతికి పాల్పడ్డ ఐదుగురు ఆర్పీలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవసరమైన కేసులను నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఈ ఐదుగురితోపాటు మరికొంత మంది ఆర్పీల ప్రమేయం కూడా ఉన్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ కోణంలో కూడా అటు మెప్మా అధికారులు, ఇటు పోలీసు అధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా తమ సంఘాల పేర్ల మీద స్త్రీనిధి రుణాలు, సబ్సిడీలను మింగిన ఆర్పీలపై విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



నిర్మల్‌లోని మెప్మా కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి, మెప్మా పీడీ(ఫైల్)